సాక్షి
వరంగల్
సోమవారం 18 సెప్టెంబర్ 2023



పెరిగిన ప్రాణహిత వరద

మహారాష్ట్రలో వర్షాలు కురుస్తుండడంతో కాళేశ్వరం వద్ద ప్రాణహిత నది పరవళ్లు తొక్కుతోంది. - 8లో▸



నల్లబెల్లం పట్టివేత - 8లో▸

జిల్లాలోని సీరోలు మండలం కొత్తతండా సమీపంలో 23బస్తాల నల్లబెల్లం, 50 కిలోల పటిక, 20 లీటర్ల గుడుంబాను పట్టుకున్నట్లు ఎక్సైజ్‌శాఖ డీటీఎఫ్ సీఐ తెలిపారు.

గరిష్టం/కనిష్టం
34° /25°

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం అక్కడక్కడా చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఘనంగా విశ్వకర్మ జయంతి



కరీమాబాద్: జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యాన వరంగల్ కలెక్టరేట్‌లో ఆదివారం విశ్వకర్మ జయంతి వేడుకలు నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన చేసి కలెక్టర్ ప్రావీణ్య కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అశ్వినితానాజీ వాకడే, బీసీ సంక్షేమ శాఖ అధికారి పుష్పలత, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ ముట్టడి



వర్ధన్నపేట: మండలంలోని చెన్నారం గ్రామపంచాయతీని ఆదివారం దళితులు ముట్టడించారు. దళితబంధు పథకంలో ఇది వరకు లబ్ధి పొందిన వారినే మళ్లీ ఎంపిక చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. దళితులు ర్యాలీగా బయల్దేరి గ్రామ పంచాయతీని ముట్టడించారు. లబ్ధి పొందిన వారినే మళ్లీ పథకానికి ఎంపిక చేయడమేంటని వారంతా సర్పంచ్, పంచాయతీ కార్యదర్శితో వాగ్వాదానికి దిగారు. ఎమ్మెల్యే అరూరి రమేశ్ స్పందించి గ్రామంలో నిరుపేద అర్హులైన వారికి దళితబంధు లభించేలా చూడాలని స్థానిక సర్పంచ్ పానుగోటి భాస్కర్‌రావు, పంచాయతీ కార్యదర్శి మురళికి వినతి పత్రం అందించారు. పెండింగ్‌లో ఉన్న ఇంటి స్థలాల పంపిణీ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుని అర్హులైన వారికి నివేశన స్థలాలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తూళ్ల హరీశ్, బర్ల సహదేవ్, కలకోటి దేవేందర్, నాంపెల్లి యాకస్వామి, తూళ్ల సుధాకర్, జన్ను రాజు, కట్ల లక్ష్మణ్ గ్రామస్తులు పాల్గొన్నారు.

కేటీఆర్ క్షమాపణ చెప్పాలి



వర్ధన్నపేట: వర్ధన్నపేటలో అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించినందుకు మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ క్షమాపణ చెప్పాలని ఏఐసీసీ సభ్యుడు బక్క జడ్సన్ డిమాండ్ చేశారు. అభివృద్ధి పనుల పేరిట అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించడాన్ని నిలదీస్తే జేపీసీ, దళిత నాయకులను అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ.. ఆదివారం హైదరాబాద్ సెక్రటేరియెట్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహానికి బక్క జడ్సన్ క్షీరాభిషేకం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రిజర్వేషన్ కోటాలో గెలిచిన ఎమ్మెల్యే అరూరి రమేశ్ ఆగడాలకు అంతులేకుండా పోతోందన్నారు. కేటీఆర్ పర్యటనను పురస్కరించుకుని ఆయన మెప్పు పొందడం కోసం ఏకపక్ష నిర్ణయాలు తీసుకుని దళితుల మనోభావాలు దెబ్బతీస్తున్నారని మండిపడ్డారు.

వివాహిత అదృశ్యం

చెన్నారావుపేట: మండలంలోని పాపయ్యపేట శివారు నడిమి తండాకు చెందిన వివాహిత బాదావత్ సమత ఆదివారం అదృశ్యమైంది. ఉదయం ఆమె ఇంట్లోంచి వెళ్లిపోయింది. పనికి వెళ్లి ఇంటికి తిరిగొచ్చిన యాకూబ్‌కు తన భార్య కనిపించకపోవడంతో చుట్టుపక్కల వెతికాడు. ఎంతకూ ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. యాకూబ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తోట మహేందర్ తెలిపారు.

దరఖాస్తులు త్వరగా స్వీకరించాలి



హన్మకొండ అర్బన్: నియోజకవర్గంలో 18–19 సంవత్సరాల వయస్సు కలిగిన ఓటర్ల నమోదు ఎక్కువగా ఉన్నందున వారి నుంచి ఫామ్–6 దరఖాస్తులు త్వరగా స్వీకరించాలని ఈఆర్‌ఓ ఎల్.రమేశ్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో బీఎల్‌ఓలు, బీఎల్‌ఓ సూపర్‌వైజర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం నియోజకవర్గంలో 18-19 ఏళ్ల వయసు ఓటర్లు 4,400 వరకు మాత్రమే ఉన్నారని, ఇంకా 10వేల వరకు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హనుమకొండ, కాజీపేట తహసీల్దార్లు విజయ్‌కుమార్, బాప్‌సింగ్ తదితరులున్నారు.

సంక్షేమంలో అగ్రగామి

- అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్న తెలంగాణ
- శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్
- వరంగల్‌లో ఘనంగా జాతీయ సమైక్యతా దినోత్సవం



మాట్లాడుతున్న శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్ చిత్రంలో కలెక్టర్ ప్రావీణ్య

కరీమాబాద్: సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే తెలంగాణ అగ్రగామిగా నిలుస్తోందని శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్ అన్నారు. వరంగల్ ఆజంజాహి మిల్ గ్రౌండ్ (ఐడీఓసీ) మైదానంలో ఆదివారం జరిగిన తెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవ వేడుకలకు బండా ప్రకాశ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా జాతీయ జెండాను ఆవిష్కరించిన తర్వాత పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 60 ఏళ్ల అస్తిత్వం కోసం ఉద్యమించి స్వరాష్ట్రంగా అవతరించిన తెలంగాణ.. ప్రస్తుతం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందన్నారు. స్వరాష్ట్రంలో పరిశ్రమలు, పర్యావరణం, పల్లె, పట్టణ ప్రగతి, సంక్షేమ పథకాలతో సబ్బండవర్ణాలను ఆదుకునేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. విప్లవాత్మక పథకాలతో రాష్ట్రం దేశానికి అన్నపూర్ణగా నిలుస్తోందని చెప్పారు. నర్సంపేటలో మెడికల్ కళాశాల ఏర్పాటుతో ఆ ప్రాంతం హెల్త్‌హబ్‌గా మారుతుందని తెలిపారు. అనంతరం తెలంగాణలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య, మేయర్ గుండు సుధారాణి, డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీం, అడిషనల్ కలెక్టర్లు శ్రీవత్స, అశ్వినితానాజీ వాకడే, డీసీపీ రవీందర్, వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి, ఎమ్మెల్యేలు నరేందర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, ఎంఎల్‌సీ బస్వరాజు సారయ్య, మాజీ జెడ్పీ చైర్మన్ సాంబారి సమ్మారావు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. కేజీబీవీ గీసుకొండ విద్యార్థులు, జీహెచ్‌ఎస్ కరీమాబాద్ విద్యార్థుల నృత్యాలు అలరించాయి.



వరంగల్‌లో జాతీయజెండాకు వందనం చేస్తున్న ప్రావీణ్య, బండా ప్రకాశ్



వరంగల్ కలెక్టరేట్‌లో జెండాకు వందనం చేస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

కలెక్టరేట్‌లో సమైక్యతా వేడుకలు

వరంగల్ కలెక్టరేట్‌లో ఆదివారం తెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య జాతీయ పతాకావిష్కరణ చేసి జెండా వందనం చేశారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు శ్రీవత్స, అశ్వినితానాజీ వాకడే, ఆర్డీఓ వాసుచంద్ర, ఏఓ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



నృత్యాలు చేస్తున్న విద్యార్థులు



విద్యార్థినులకు ప్రశంసపత్రాలు అందజేస్తూ..



గౌరవ వందనం సమర్పిస్తున్న పోలీసులు

నర్సంపేటలో..

నర్సంపేట: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రజనికిషన్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు రాయిడి రవీందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

వర్ధన్నపేటలో..

వర్ధన్నపేట: వర్ధన్నపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జాతీయ సమైక్యతా దినోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే అరూరి రమేశ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా అరూరి రమేశ్ మాట్లాడుతూ.. ఘనంగా ప్రతీ హృదయంలో జాతీయభావం పెంపొందేలా జాతీయ సమైక్యతా వజ్రోత్సవాలను నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు.



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జెండాను ఆవిష్కరిస్తున్న అరూరి రమేశ్

నేడు వినాయక చవితి

- జిల్లాలో పండుగ సందడి



వరంగల్ నగరంలో విగ్రహం కొంటున్న మహిళ

నర్సంపేట: విఘ్నాలను తొలగించి విజయాలను చేకూర్చే గణనాథుడి పండుగ వినాయక చవితిని సోమవారం వరంగల్ జిల్లా ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకునేందుకు సిద్ధమయ్యారు. గణపతి విగ్రహాలు, పూజాపత్రులు, పాలవెల్లులు, సున్నం, జాజు, బుక్కగులాలు, సేమియా ప్యాకెట్లు, పూల కొనుగోలుదారులతో మండల కేంద్రాల్లోని పట్టణాలు కిక్కిరిశాయి. నవరాత్రులకు మండపాలు ముస్తాబయ్యాయి.

పల్లె నుంచి పూజా సామగ్రి

- పత్రి, పూలు, పండ్లు గ్రామాల నుంచి పట్టణాలకు తరలింపు
- ఉపాధి పొందుతున్న గ్రామీణులు



పత్రి, ఫలాలను వరంగల్‌కు తరలిస్తూ..

దుగ్గొండి: గణపతి పూజ కోసం ఉపయోగించే పూజ సామగ్రిని గ్రామీణులు పట్టణాలకు తరలిస్తూ ఉపాధి పొందుతున్నారు. మహిళలు పలు రకాల పత్రులు, పండ్లు సేకరించి విక్రయించడానికి పట్టణానికి తరలిస్తున్నారు. తులసి, జిల్లేడు, రేగు, మరువం, రావి, దానిమ్మ, ఉత్తరేణి, మామిడి, బిల్వపత్రం, నేరేడు, మారేడు, గరిక, మాచిపత్రి, జమ్మి, మునగాకు, ఎలక్కాయలు, మారేడు కాయలు, సీతాఫలం, మొక్కజొన్న కంకులను సేకరించి అమ్మేందుకు ఆదివారం వరంగల్, హనుమకొండ పట్టణాలకు తీసుకెళ్లారు.

పథకాలకు ఆకర్షితులై చేరికలు



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట : బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం నల్లబెల్లి మండలంలోని లెంకాలపల్లి, దస్తగిరిపల్లి నుంచి పలువురు, దుగ్గొండి మండలం మల్లంపల్లి, చంద్రయ్యపల్లి, బొబ్బరోనిపల్లి గ్రామాల నుంచి ముదిరాజ్ సంఘ సభ్యులు మత్స్యశాఖ సంఘం సభ్యులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే నర్సంపేట నియోజకవర్గానికి ప్రభుత్వ మెడికల్ కళాశాలను మంజూరు చేస్తూ రూ.183 కోట్ల నిధులను కేటాయించినందుకు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు బీఆర్‌ఎస్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో కృతజ్ఞతలు తెలిపారు. నర్సంపేట పట్టణ మహిళా సమాఖ్య నూతన కమిటీ అధ్యక్షురాలు ఆడెపు రమ, కార్యవర్గ సభ్యులు ఆదివారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు

చెన్నారావుపేట: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తోట మహేందర్ తెలిపారు. మండలంలోని బాపునగర్ గ్రామానికి చెందిన బాదావత్ రాజు మద్యం విక్రయిస్తున్నాడనే సమాచారం మేరకు ఆదివారం మధ్యాహ్నం దాడులు నిర్వహించినట్లు ఎస్సై తెలిపారు. దాడుల్లో 12 బీర్లు, 1 ఫుల్ బాటిల్ స్వాధీనం చేసుకుని రాజుపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. దాడుల్లో పోలీసులు స్వామి, నవీన్, రమేశ్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ జంక్షన్ అభివృద్ధికి సహకరించాలి

- ఎమ్మెల్యే అరూరి రమేశ్



పనులు పరిశీలిస్తున్న అరూరి రమేశ్

వర్ధన్నపేట: వర్ధన్నపేటలో వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై నిర్మిస్తున్న అంబేడ్కర్ జంక్షన్ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్ కోరారు. ఆదివారం వర్ధన్నపేటలో అంబేడ్కర్ జంక్షన్ నిర్మాణపు పనులు పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబేడ్కర్ జంక్షన్ అభివృద్ధికి రూ.50 లక్షలు మంజూరు చేయడం జరిగిందని, అవసరమైతే మరిన్ని నిధులు మంజూరు ఇచ్చి అత్యాధునికంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామన్నారు. వర్ధన్నపేట మున్సిపాలిటీకి అత్యధికంగా నిధులు మంజూరు చేయించి 12 వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణాలు చేసినట్లు తెలిపారు. కుల సంఘాలకు కమ్యూనిటీ హాళ్లు మంజూరు ఇవ్వడం జరిగిందని వారు ఆ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు.

అవకాశవాద రాజకీయాలను తిప్పికొట్టాలి



మాట్లాడుతున్న పెద్దారపు రమేశ్

నర్సంపేట: అవినీతి, అవకాశవాద రాజకీయాలను తిప్పికొట్టాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్ పిలుపునిచ్చారు. ఈమేరకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా ఆదివారం పట్టణంలో ఎంసీపీఐ(యు) డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఓంకార్ భవన్‌లో సభ నిర్వహించారు. ఈసందర్భంగా రమేశ్ మాట్లాడుతూ.. రైతాంగ సాయుధ పోరాటానికి భీంరెడ్డి నర్సింహారెడ్డి, మద్దికాయల ఓంకార్, పుచ్చలపల్లి సుందరయ్య, లక్ష్మక్క, స్వరాజ్యం, కమలాదేవి లాంటి త్యాగధనులు నాయకత్వం వహించి ఆదర్శంగా నిలిచారన్నారు. తెలంగాణలో ప్రస్తుతం రజాకార్ల పాలన కొనసాగుతోందన్నారు. నిలువ నీడ లేని పేదలు భూమి కోసం పోరాడితే కేసులు బనాయించి జైల్లో పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంపదనంతా దోపిడీదారులకు అప్పజెబుతూ కులం, మతం, ప్రాంతం, సెంటిమెంట్‌తో కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో కేసీఆర్ పాలన కొనసాగిస్తున్నారని రమేశ్ విమర్శించారు. డివిజన్ నాయకుడు బుడిమే సురేందర్ అధ్యక్షతన నిర్వహించిన ఈకార్యక్రమంలో రైతాంగ సాయుధ పోరాట యోధుడు నాగెల్లి కొమురయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు కుసుంబ బాబురావు, వంగల రాగసుధ, డివిజన్ కార్యదర్శి మహ్మద్ రాజాసాహెబ్, డివిజన్ నాయకులు దామ సాంబయ్య, మార్త నాగరాజు, అల్లి సాబ్, గిరపాక కొమురయ్య, నాగెల్లి భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న ఆలయంలో కన్యాసంక్రమణ పూజలు



గొల్లకేతమ్మ, బలిజ మేడలమ్మలతో మల్లన్న కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఐనవోలు: సూర్యుడు కన్య రాశిలోకి ప్రవేశించిన సందర్భంగా ఐనవోలు శ్రీమల్లికార్జున స్వామి ఆలయంలో ఆదివారం ఉదయం నిత్య కైంకర్యాల అనంతరం కన్యాసంక్రమణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, రుద్రహోమం చేశారు. గొల్ల కేతమ్మ, బలిజ మేడలమ్మ సమేత శ్రీమల్లికార్జునస్వామి కల్యాణం శైవాగమోక్తంగా చేపట్టారు. అలాగే ఒగ్గు పూజారులు గర్భాలయం ఎదుట మహా మండపంలో నజరు పట్నం వేసినట్లు ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు తెలిపారు. కార్యక్రమంలో ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకుడు ఐనవోలు మధుకర్ శర్మ, వేద పారాయణదారు గట్టు పురుషోత్తమ శర్మ, భక్తులు పాల్గొన్నారు.

ప్రగతిలో తెలంగాణ ముందంజ

- టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు



జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి సెల్యూట్ చేస్తున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు

హన్మకొండ: స్వరాష్ట్రం సిద్ధించినప్పటి నుంచి తెలంగాణ.. ప్రగతి సూచికల్లో ముందు వరుసలో నిలుస్తోందని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్‌రావు అన్నారు. సమైక్యతా దినోత్సవం సందర్భంగా ఆదివారం హనుమకొండ నక్కలగుట్టలోని టీఎస్ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అంతకు ముందు విద్యుత్ అమర వీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నాయకత్వంలో ప్రజలు సుభిక్షంగా ఉన్నారన్నారు. సీఎం కేసీఆర్.. ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ అన్ని వర్గాలకు అందజేస్తున్నారన్నారు. దేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్య్రం వస్తే తెలంగాణ.. (నాటి నైజాం సంస్థానం) 1948 సెప్టెంబర్ 17న భారత్‌లో కలిసిందన్నారు. తెలంగాణ స్వపరిపాలన విజయం సిద్ధించిన రోజు సెప్టెంబర్ 17 అన్నారు. భారతదేశం అనేక సంస్కృతుల సమ్మేళనమన్నారు. సమైక్యతతోనే ఆర్థిక ప్రగతి, సంక్షేమమని, విద్యుత్ రంగంలో ఎన్నో మైలు రాళ్లు అధిగమించామన్నారు. ట్రాన్స్ కో, జెన్ కో సీఎండీ ప్రభాకర్ రావు నేతృత్వంలో ప్రజలకు మెరుగైన, నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్లు బి.వెంకటేశ్వరరావు, పి.గణపతి, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బి.జనార్దన్, సీజీఎంలు బి.అశోక్ కుమార్, టి.సదర్ లాల్, వి.మోహన్ రావు, కె.కిషన్, ప్రభాకర్, రవీంద్రనాథ్, జాయింట్ సెక్రటరీ కె.రమేష్, కంపెనీ కార్యదర్శి కె.వెంకటేశం, విజిలెన్స్, ఏపీటీఎస్ ఇన్‌స్పెక్టర్ శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి ఎదుట మృతుడి బంధువుల ఆందోళన

వరంగల్ చౌరస్తా: వరంగల్ జేపీఎన్ రోడ్డులోని సత్య హాస్పిటల్ ఎదుట ఆదివారం మృతుడి బంధువులు ఆందోళనకు దిగారు. వరంగల్ శివనగర్‌కు చెందిన మధు (42) మోకాళ్ల చిప్ప ఆపరేషన్ కోసం మూ్డ్రోజుల క్రితం సత్య ఆస్పత్రిలో చేరాడు. శస్త్ర చికిత్స పూర్తయింది. అయితే మధు అకస్మాత్తుగా మృతి చెందడంతో అతడి బంధువులు వైద్యుడి నిర్లక్ష్యమే ఇందుకు కారణమని ఆందోళనకు దిగారు. వరంగల్ ఇంతేజార్‌గంజ్, మట్టెవాడ పోలీసులు చేరుకున్నారు. కనీసం కేషీట్స్, ఇతర రిపోర్టులు అడగ్గా వైద్యులు ఇవ్వడంలేదని మృతుడి బంధువులు నిరసన తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇంతేజార్‌గంజ్ సీఐ ముస్కె శ్రీనివాస్ తెలిపారు.

కమిషనరేట్‌లో సమైక్యతా దినోత్సవం

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఆదివారం జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్ జాతీయ జెండా ఆవిష్కరించిన అనంతరం సిబ్బందికి, పిల్లలకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీసీపీలు దాసరి మురళి, రవీందర్, బారి, అదనపు డీసీపీలు రాగ్యానాయక్, సంజీవ్, సురేశ్‌కుమార్, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఆర్‌ఐలు, ఎస్సైలు, పరిపాలనా విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

- రెడ్డి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు జయపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న గోపు జయపాల్‌రెడ్డి

ధర్మసాగర్: రెడ్డి కులస్తుల సంక్షేమానికి రూ.5000 కోట్లతో కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని రెడ్డి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు గోపు జయపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని పెద్ద పెండ్యాలలో సంఘం గ్రామ అధ్యక్షుడు బొల్లెడ్ల ప్రకాశ్‌రెడ్డి అధ్యక్షతన ఆదివారం రెడ్డి సంఘం కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం జయపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో పేద రెడ్డి కులస్తుల పిల్లలకు విదేశీ విద్యా నిధి కేటాయించాలని కోరారు. ప్రతీ రైతుకు రూ.5 లక్షలు హెల్త్ కార్డు ఇవ్వాలని, రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో రెడ్డి సంక్షేమ భవన్‌కు 5 ఎకరాల భూమి కేటాయించి, భవన నిర్మాణానికి 10 కోట్లు నిధులు కేటాయించాలన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు పూర్తిస్థాయిలో వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. శ్మశాన వాటిక కోసం బొల్లెడ్ల మదన్‌మోహన్‌రెడ్డి తన భూమి నుంచి 5 గుంటలు ఉచితంగా ఇచ్చారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు అర్జుల కిషన్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ పత్తి సంపత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఊకంటి వనంరెడ్డి, ఉపాధ్యక్షుడు మట్ట రాజశేఖర్, మండల అధ్యక్షుడు తోకల జయపాల్, మండల ఉపాధ్యక్షుడు పల్లెర్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఏడెల్లి తిరుపతి, సోషల్ మీడియా రాష్ట్ర అధ్యక్షుడు గుజ్జుల శ్రీనివాస్, యూత్ విభాగం మండల అధ్యక్షుడు బొల్లెడ్ల వికాస్, తదితరులు పాల్గొన్నారు.

18 ఏళ్లు నిండిన వారికి ఓటు హక్కు



మాట్లాడుతున్న ట్రైయినీ కలెక్టర్

కాజీపేట అర్బన్: వయసు 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు లభిస్తుందని, ఫామ్–6 పూర్తి చేసి నమోదు చేసుకోవాలని ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా తెలిపారు. హంటర్‌రోడ్డులోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ డిగ్రీ బాలికల కళాశాలలో ఆదివారం ఓటు హక్కుపై ఏర్పా టు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. దేశభవిష్యత్ యువత చేతుల్లోనే ఉందని, మెరుగైన సమాజ నిర్మాణానికి సరైన ప్రజాప్రతినిధులను ఎంచుకోవడానికి ఓటు హక్కును వినియోగించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ హరిప్రసాద్, కళాశాల సిబ్బంది ఉన్నారు.

వానరానికి అంత్యక్రియలు



కోతికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న గ్రామస్తులు

గూడూరు: మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం గుండెంగ ఎస్సీ కాలనీలో ఆదివారం మృతిచెందిన వానరానికి(కోతి) స్థానికులు అంత్యక్రియలు నిర్వహించారు. నిత్యం ఉదయం, సాయంత్రం కోతులు కాలనీలో సంచరిస్తూ ఉంటాయి. ఈ క్రమంలో ఉదయం ఓ కోతి చనిపోయి పడి ఉంది. గమనించి స్థానికులు ఒకరు గ్రామానికి చెందిన వాట్సాప్ గ్రూప్‌లో ఫొటో పోస్ట్ చేయడంతో.. అందరూ అక్కడికి చేరుకున్నారు. వానరాన్ని ఆంజనేయుడిగా భావించి డప్పు చప్పుళ్లతో అంత్యక్రియలు నిర్వహించారు.

మైనంతో బుల్లి గణపయ్య



మైనంతో తయారు చేసిన సూక్ష్మ గణపతి



కళాకారుడు జయకుమార్

నర్సంపేట: నర్సంపేట పట్టణానికి చెందిన సూక్ష్మ కళాకారుడు శ్రీరామోజు జయకుమార్ గణపతి దీక్షలో ఉండి వినాయక చవితి సందర్భంగా మైనంతో మహాగణనాథుడిని తయారు చేశాడు. ఒక ఇంచు కన్నా తక్కువ పరిమాణంలో మైనంతో తీర్చిదిద్దాడు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతీ సంవత్సరం విభిన్న గణపతులను తయారు చేస్తున్నట్లు జయకుమార్ తెలిపారు.

బరిలో దిగితే.. పతకం పక్కా..

క్రీడల్లో రాణిస్తున్న గిరిజన పాఠశాల విద్యార్థినులు

- జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ
- ప్రోత్సహిస్తే మరింత సత్తా చాటుతామంటున్న బాలికలు



కబడ్డీ ఆడుతున్న విద్యార్థినులు(ఫైల్)

కాటారం: ప్రస్తుత కాలంలో చదువుతో పాటు క్రీడలకూ అత్యంత ప్రాధాన్యం ఉంది. ఓ వైపు తరగతి గదుల్లో పుస్తకాలతో కుస్తీ పడుతూనే.. మరో వైపు మైదానంలో క్రీడల్లో రాణిస్తూ దేశానికి పేరు తీసుకొస్తున్నారు. గ్రామస్థాయి నుంచి.. అంతర్జాతీయ స్థాయి వరకు.. వివిధ క్రీడల్లో పాల్గొన్న ఎందరో విద్యార్థులు పతకాలు సాధిస్తూ దేశ కీర్తిని విశ్వవ్యాప్తం చేస్తున్నారు. ఫలితంగా వీరిని ఆదర్శంగా తీసుకున్న మరికొందరు విద్యార్థులు క్రీడలపై ఆసక్తి పెంపొందించుకుంటూ ముందుకెళ్తున్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలు కూడా క్రీడలకు నిలయాలుగా మారుతున్నాయి. మండలంలోని మేడిపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. పాఠశాల వరకే పరిమితం కాకుండా జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో రాణిస్తున్నారు.

రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ..

పాఠశాలలోని సుమారు 60 మంది విద్యార్థినులు కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్‌లో ప్రతిభ కనబరుస్తున్నారు. గతేడాది కాలంగా పలు ప్రాంతాల్లో జరిగిన జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణిస్తూ పాఠశాల ప్రత్యేకతను చాటుతున్నారు. గత డిసెంబర్‌లో ఏటూరునాగారం ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహించిన జోనల్, రాష్ట్ర స్థాయి, భద్రాచలంలోని కిన్నెరసాని వద్ద జరిగిన ఇంటర్ సొసైటీ గిరిజన విద్యార్థుల క్రీడల్లో ప్రతిభ కనబరిచారు. అండర్ -14, అండర్-17 బాలికల విభాగంలో పలు పతకాలు కైవసం చేసుకున్నారు. ఖోఖో పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికవడంతో పాటు ఇంటర్‌సొసైటీ క్రీడల్లో ఓవరాల్ విభాగంలో రెండో స్థానంలో నిలిచారు. ఇద్దరు విద్యార్థినులు అండర్ -14 రాష్ట్ర స్థాయి జట్టులో స్థానం సాధించారు. అంతేకాకుండా గతంలో జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడల్లో సుమారు 40 మంది విద్యార్థినులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం రవిశంకర్, పీఈటీ వీరన్న తెలిపారు. షటిల్ బ్యాడ్మింటన్, అర్చరీ, జావెలిన్‌త్రో, షాట్ పుట్, హ్యాండ్‌బాల్, లాంగ్‌జంప్ క్రీడల్లో కూడా విద్యార్థినులు ముందంజలో నిలుస్తున్నారు.

ప్రోత్సహిస్తే మరింత ముందుకు..

అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రోత్సాహం అందిస్తే క్రీడల్లో మరింత రాణిస్తామని పలువురు విద్యార్థినులు పేర్కొంటున్నారు. పాఠశాలలో ఉన్న కొంత మేర సౌకర్యాలు, సామగ్రితో నిత్యం ప్రాక్టీస్ చేస్తున్నామని వారు తెలిపారు. తమకు కావాల్సిన సామగ్రి అందించి సహకరిస్తే ముందుకెళ్తామంటున్నారు. ఆర్థికంగా అంతంత మాత్రంగానే ఉండడంతో పోటీల్లో పాల్గొనడానికి ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి సమయంలో ఇబ్బందులు తలెత్తుతున్నట్లు వారు ఆవేదన వ్యక్తం చేశారు.

ఉపాధ్యాయుల ప్రోత్సాహం మరువలేనిది



మా ప్రధానోపాధ్యాయుడు, పీఈటీ.. క్రీడల్లో అందజేస్తున్న ప్రోత్సాహం మరువలేనిది. వారి ప్రోత్సాహంతో మరింత ముందుకెళ్తా. భవిష్యత్‌లో ఉన్నత స్థాయిలో పతకాలు సాధిస్తా.

- అపర్ణ, విద్యార్థిని

జాతీయ స్థాయిలో రాణించడమే లక్ష్యం



అర్చరీ విభాగంలో జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చి నేషనల్ మీట్‌కు ఎంపికయ్యా. ఇదే ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో కూడా రాణించాలన్నదే నా లక్ష్యం. ఇందుకోసం నిరంతరం ప్రాక్టీస్ చేస్తున్న. కొన్ని అసౌకర్యాలతో ఇబ్బంది కలుగుతోంది. అయినా జాతీయ స్థాయిలో రాణిస్తాననే నమ్మకం ఉంది.

- వరలక్ష్మి, విద్యార్థిని

విద్యార్థులకు నిరంతర శిక్షణ



చదువుతో పాటు క్రీడల్లో రాణించేలా విద్యార్థినులను తీర్చిదిద్దుతున్నాం. రోజు శిక్షణ అందజేస్తున్నాం. పీఈటీ, ఉపాధ్యాయులు సహకారంతో విద్యార్థినులు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చాటుతున్నారు. వారిని మరింత ముందుకు తీసుకెళ్లేలా చర్యలు తీసుకుంటాం. అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరిస్తే విద్యార్థులు మరింత ముందుకెళ్లే అవకాశం ఉంది.

- రవిశంకర్, హెచ్‌ఎం, గిరిజన ఆశ్రమ పాఠశాల

సూక్ష్మ కళ ద్వారా గణపతి ఆకృతులు..

- అబ్బురపరుస్తున్న రజనీకాంత్ కళా నైపుణ్యం



చాక్‌పీస్‌పై రూపొందించిన సూక్ష్మ గణపతులు

కాటారం: చాక్‌పీస్‌లు, పెన్సిల్ గ్రాఫైట్‌లపై అతిసూక్ష్మ ఆకృతులు రూపొందించి అబ్బురపరుస్తున్నారు ఓ ఆర్ట్ ఉపాధ్యాయుడు. సందర్భానికి అనుగుణంగా.. కార్యక్రమ విశిష్టతను తెలియజేసేలా చిన్న ఆకృతులు తయారు చేసి కళానైపుణ్యం చాటుకుంటున్నారు మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల ఆర్ట్ ఉపాధ్యాయుడు ఆడెపు రజనీకాంత్. గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా చాక్‌పీస్‌పై పది మిల్లీమీటర్ల ఎత్తు, ఆరు మిల్లీమీటర్ల వెడల్పు ఉన్న గణపతి నమూనాను తయారు చేశారు. గుండు పిన్ను సాయంతో మూడు గంటలు శ్రమించి ఈ ఆకృతిని రూపొందించారు. అలాగే, పెన్సిల్ గ్రాఫైట్‌పై 1.8 మిల్లీమీటర్ల ఎత్తు, 1.2 మిల్లీమీటర్ల వెడల్పు ఉన్న బుజ్జి గణపతిని, మూడు సెంటీమీటర్ల ఎత్తున్న చెడు వినకు.. చెడు చూడకు.. చెడు మాట్లాడకు అనే రూపంలో గణపతి ఆకృతులను తయారు చేశారు. నాలుగు గంటలు శ్రమించి 3.5 సెంటీమీటర్ల ఎత్తున్న నిల్చున్న గణనాథుడి విగ్రహాలను ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌పై చెక్కి ప్రజలకు గణపతి నవరాత్రి ఉత్సవాల శుభాకాంక్షలు తెలిపారు. రజనీకాంత్ గతంలో పెన్సిల్ గ్రాఫైట్‌పై అతి చిన్న గణనాథుడి ప్రతిమ చెక్కి బుక్ ఆఫ్ స్టేట్ రికార్డ్, తెలుగుబుక్ ఆఫ్ రికార్డు, తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డుతో పాటు, ఆర్.హెచ్.ఆర్ వరల్డ్ రికార్డు, సృజనపుత్ర అవార్డులను సొంతం చేసుకొన్నారు. అబ్బురపరిచే కళానైపుణ్యతను చూసి పలువురు రజనీకాంత్‌కు అభినందనలు తెలిపారు.

పెరిగిన ప్రాణహిత వరద

- ఇన్‌ఫ్లో 4.33 లక్షల క్యూసెక్కులు



కాళేశ్వరం వద్ద గోదావరి, ప్రాణహిత నదుల ఉధృతి

కాళేశ్వరం: తెలంగాణలో వర్షాలు తగ్గుముఖపట్టడంతో గోదావరికి వరద ఇన్‌ఫ్లో తగ్గింది. అయితే మహారాష్ట్రలో వర్షాలు కురుస్తుండడంతో ప్రాణహిత నది పరవళ్లు తొక్కుతోంది. ఆదివారం మహారాష్ట్రలో ఎగువన కురుస్తున్న వర్షాలతో జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం వద్ద ప్రాణహిత నది వరద గోదావరిలో కలిసి ఉధృతంగా ప్రవహిస్తున్నది. రెండు నదులు కలిసి వరద పుష్కర ఘాట్‌ను తాకుతూ దిగువకు తరలిపోతున్నది. దీంతో మేడిగడ్డలోని లక్ష్మీబ్యారేజీలో మొత్తం 85 గేట్లు ఎత్తి నీటిని దిగువకు తరలిస్తున్నారు. ప్రాణహిత ఇన్‌ఫ్లో 4,33,120 క్యూసెక్కులు ఉంది. కాగా, గోదావరికి వరద తగ్గడంతో అన్నారంలోని సరస్వతీ బ్యారేజీకి ఇన్‌ఫ్లో 11,469 క్యూసెక్కులు తరలివస్తున్నది. మొత్తం 66 గేట్లకు 3 గేట్లు ఎత్తి నీటిని దిగుకు కాళేశ్వరం వైపు తరలిస్తున్నారు. బ్యారేజీ పూర్తి సామర్థ్యం 10.87 టీఎంసీలకు ప్రస్తుతం 6.232 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

ప్రియుడి ఇంటి ఎదుట ప్రియురాలి దీక్ష

- మహిళా సంఘాల మద్దతు



పెద్దకుంటపల్లి తండాలో ప్రియుడి ఇంటి ఎదుట దీక్ష చేస్తున్న కృష్ణవేణి

భూపాలపల్లి రూరల్ /భూపాలపల్లి అర్బన్:ప్రేమించి పెళ్లి చేసుకోను పొమ్మంటున్నాడని, తనకు ప్రియుడితో పెళ్లి చేసి న్యాయం చేయాలని కోరుతూ మండలంలోని వేశాలపల్లి శివారు పెద్దకుంటపల్లి తండాకు చెందిన గుగులోత్ కృష్ణవేణి ప్రియుడి ఇంటి ఎదుట దీక్ష చేపట్టిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. భూపాలపల్లి మున్సిపల్ పరిధిలోని పెద్దకుంటపల్లి తండాకు చెందిన కృష్ణవేణి డిగ్రీ వరకు చదువుకుంది. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన భూక్య జంపయ్యతో కృష్ణవేణి ప్రేమలో పడింది. రెండేళ్ల క్రితం జంపయ్య తనకు మాయ మాటలు చెప్పి వివాహం చేసుకుంటానని నమ్మబలికి తనను వంచించాడని విలేకరులతో రోదిస్తూ తెలిపింది. రెండేళ్ల నుంచి జంపయ్య వేరే అమ్మాయితో వివాహం నిశ్చయించుకొని ఎంగేజ్‌మెంట్ చేసుకున్నాడు. తనకు న్యాయం చేయాలంటూ పోలీస్‌స్టేషన్ కూడా వెళ్లినట్లు తెలిపింది. పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ నిర్వహించి పెద్దలు పెళ్లి చేసుకోవాలని చెప్పినప్పటికీ జంపయ్య ముఖం చాటేశాడని పేర్కొంది. భూపాలపల్లి సీఐ నేతృత్వంలో పోలీసులు కౌన్సెలింగ్ చేసి వివాహం చేసుకోవాలని జంపయ్యకు చెప్పినప్పటికీ వినకుండా తనపై దాడి చేశాడని కృష్ణవేణి తెలిపింది. జంపయ్యతోనే నాకు వివాహం జరిపించాలని ప్రియుడి ఇంటి ఎదుట కుటుంబ సభ్యులతో కలిసి నిరసన దీక్ష చేసినట్లు తెలిపింది. కృష్ణవేణికి మహిళా సంఘాలు సంఘీభావం తెలిపాయి. కృష్ణవేణిని వివాహం చేసుకోవాలని లేనిపక్షంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని మహిళా సంఘాల నాయకురాళ్లు జంపయ్య కుటుంబ సభ్యులను హెచ్చరించారు.

ధర్మ పరిరక్షణ కోసమే సనాతన ధర్మం

- కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి రాజ్‌కుమార్ రంజన్‌సింగ్
- హనుమకొండ వేయిస్తంభాల దేవాలయం సందర్శన



కేంద్ర సహాయమంత్రికి మహాదాశీర్వచనం అందజేస్తున్న అర్చకులు

హన్మకొండ కల్చరల్: హిందూ దేవాలయాల్లో ధర్మ పరిరక్షణ కోసం సనాతన ధర్మాన్ని అనుసరించి కార్యక్రమాలు నిర్వహించుకోవాలని కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి రాజ్‌కుమార్ రంజన్‌సింగ్ అన్నారు. ఆదివారం హనుమకొండలోని శ్రీరుద్రేశ్వరస్వామి వారి వేయి స్తంభాల దేవాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ వెంకటయ్య, ప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ.. కేంద్ర సహాయ మంత్రిని ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతించారు. మంత్రి స్వామివారికి అభిషేకం, పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు తీర్థప్రసాదాలు, స్వామివారి శేష వస్త్రాలు, మహాదాశీర్వచనం అందజేశారు. ప్రధాని మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు చేసినట్లు మంత్రి తెలిపారు.

నల్లబెల్లం పట్టివేత

- 50 కిలోల పటిక, 20 లీటర్ల గుడుంబా స్వాధీనం



పట్టుకున్న నల్లబెల్లం బస్తాలను చూపిస్తున్న డీటీఎఫ్ సీఐ కృష్ణ

మహబూబాబాద్ రూరల్ : జిల్లాలోని సీరోలు మండలం కొత్తతండా సమీపంలో 23 బస్తాల నల్ల బెల్లం, 50 కిలోల పటిక, 20 లీటర్ల గుడుంబాను పట్టుకున్నామని ఎక్సైజ్ శాఖ డీటీఎఫ్ సీఐ బి.కృష్ణ ఆదివారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నుంచి మహబూబాబాద్ ప్రాంతానికి నల్లబెల్లం తీసుకువస్తున్నారనే పక్కా సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించగా, సీరోలు మండలం కొత్త తండ సమీపంలో అశోకా లేలెండ్ వాహనంలో 23 బస్తాల నల్లబెల్లం, 50 కిలోల పటిక, 20 లీటర్ల గుడుంబా లభించిందన్నారు. వాటిని స్వాధీనం చేసుకుని ఎక్సైజ్ స్టేషన్ తరలించామన్నారు. దీనికి సంబంధించి వాహన డ్రైవర్ సుబ్రహ్మణ్యం, సూర్యాపేటకు చెందిన తిరుపతి, కొత్త తండాకు చెందిన బిక్కులపై కేసు నమోదు చేశామన్నారు. ఈ తనిఖీల్లో డీటీఎఫ్ ఎస్సై హరీష్, సిబ్బంది వెంకన్న, నర్సింహారావు, తదితరులు పాల్గొన్నారు.

అలిగేటిలో యువకుడి గల్లంతు...?



బయ్యారం: బయ్యారం సమీపంలోని అలిగేటిలో ఓ యువకుడు గల్లంతయ్యాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. బయ్యారం గ్రామానికి చెందిన బొలగాని రమేశ్(25) ఆదివారం సాయంత్రం సమీపంలో అలిగేటి వద్దకు ద్విచక్రవాహనంపై వెళ్లాడు. బ్రిడ్జి వద్ద వాహనం నిలిపి అందులో సెల్‌ఫోన్ ఉంచి నీటిలో దిగినట్లు అక్కడ ఉన్న ఆనవాళ్లను బట్టి తెలుస్తోంది. రమేశ్ కోసం గాలించినప్పటికి చీకటి కావడంతో ఆచూకీ లభ్యం కాలేదు. సంఘటనా స్థలాన్ని ఎస్సై ఉపేందర్ పరిశీలించారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య



కొంరయ్య(ఫైల్)

నల్లబెల్లి: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వ్యక్తి.. మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై నైనాల నగేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గుండ్లపహాడ్ గొల్లపల్లికి చెందిన కోల కొంరయ్య(48) వ్యవసాయం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. గత ఆరేళ్లుగా టీబీ, దమ్ము వ్యాధితో అనారోగ్యానికి గురయ్యాడు. అప్పటి నుంచి చికిత్స తీసుకుంటున్నాడు. అయినా వ్యాధి నయం కాకపోవడంతో తాగుడుకు బానిసయ్యాడు. శనివారం తీవ్రంగా దమ్ము రావడంతో మనస్తాపానికి గురై ఇంటి ఎదుట ఉన్న పత్తి చేనులోకి వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడి వైద్యుల సూచనల మేరకు ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, ముగ్గురు కుమారులు ఉన్నారు. మృతుడి కుమారుడు రాజ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఉరివేసుకుని వ్యక్తి..

కురవి: భార్య కాపురానికి రావడం లేదని జీవితంపై విరక్తి చెంది జాటోత్ అశోక్ (32) ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని రాజోలు శివారు హరిదాసు తండాలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి..తండాకు చెందిన జాటోత్ అశోక్‌కు వివాహం కాగా భార్య నిఖిత గత రెండేళ్ల నుంచి పిల్లలతో కలిసి తల్లిగారింటి వద్ద ఉంటోంది. భార్య రావడంలేదని మనస్తాపానికి గురై తన ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తండాకు చెందిన ఓ మహిళ కిటికీలోంచి తాడుకు వేలాడుతూ అశోక్ కనిపించడంతో వెంటనే తండావాసులకు విషయాన్ని వివరించింది. వారు వెంటనే పోలీసులకు సమాచారం అందజేశారు. ఎస్సై గోపి తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కిందికి తీసి మహబూబాబాద్ జనరల్ ఆస్పత్రికి తరలించి మార్చురీలో భద్రపరిచారు. మృతుడి తల్లి నాన్కు హైదరాబాద్‌లో ఉంటుందని పోలీసులు తెలిపారు.

పాకాలలో పర్యాటకుల సందడి



ఖానాపురం: పాకాలలో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. జిల్లాలోని పలు ప్రాంతాలతోపాటు నర్సంపేట, ఖానాపురం మండలాల ప్రజలు పాకాలలో ఉత్సాహంగా గడిపారు. పలువురు వనభోజనాలకు తరలివచ్చి కట్టమైసమ్మ వద్ద ప్రత్యేక పూజలు చేశారు. మత్తడి ప్రదేశం వద్ద జలకాలాడుతూ కేరింతలు కొట్టారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

- వైద్యం వికటించి మృతి చెందాడని కుటుంబీకుల ఆరోపణ..
- ఆస్పత్రి ఎదుట ఆందోళన



ఆస్పత్రి ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కుటుంబీకులు, గ్రామస్తులు

నర్సంపేట రూరల్ : చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి మృతి చెందాడు. అయితే వైద్యం వికటించడంతోనే మృతి చెందాడని ఆరోపిస్తూ కుటుంబీకులు ఆస్పతి ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ ఘటన ఆదివారం నర్సంపేట పట్టణంలో జరిగింది. మృతుడి బంధువుల కథనం ప్రకారం నర్సంపేట మండలం బానోజీపేటకు చెందిన బానోత్ భద్రు (50) కూలీ పనిచేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. కాగా, పది సంవత్సరాల క్రితం భద్రు భార్య మృతి చెందింది. మృతుడికి నలుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఈ క్రమంలో నాలుగు రోజుల క్రితం ఇంటి వద్ద కాలు జారి పడడంతో భద్రుకు కుడికాలు విరిగింది. దీంతో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఎంజీఎంకు రెఫర్ చేయగా వారు నర్సంపేట పట్టణంలోని న్యూ అమ్మ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి ఆరోగ్యశ్రీ పథకంలో ఆపరేషన్ చేస్తామని అడ్మిట్ చేసుకున్నారు. అప్రూవల్ రావడంతో శనివారం మధ్యాహ్నం ఆపరేషన్ చేయగా ఆదివారం తెల్లవారుజామున మృతిచెందాడు. ఆస్పత్రి సిబ్బంది, వైద్యులు.. కుటుంబ సభ్యులకు సమాచారం అందించకుండానే అంబులెన్స్‌లో భద్రు మృతదేహాన్ని, ఆయన కుమార్తెను గ్రామానికి తరలించారు. మృతదేహాన్ని ఇంటివద్ద దింపగా గ్రామస్తులు, కుటుంబీకులు ఆశ్చర్యానికి గురయ్యారు. వెంటనే మృతదేహాన్ని ప్రత్యేక అంబులెన్స్‌లో ఆస్పత్రికి తీసుకొచ్చి వైద్యుడితో మాట్లాడడంతో నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు. దీంతో వైద్యం వికటించి మృతి చెందారంటూ ఆరోపిస్తూ మృతదేహాన్ని ఆస్పత్రి వద్ద ఉంచి నిరసన వ్యక్తం చేశారు. దీనిపై సమాచారం అందుకున్న ఎస్సై రవి ఘటనా స్థలికి చేరుకుని బంధువులను వివరాలను అడిగి తెలుసుకుని, వైద్యులతో మాట్లాడారు. దాదాపు మూడు గంటలు బంధువులు, వైద్యులతో చర్చలు జరిపించారు. చివరకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోలన కారులు శాంతించారు. ఈ ఘటనపై మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవి తెలిపారు.

గుండెపోటుతో మృతిచెందాడు..

భద్రుకు కాలు విరగడంతో నాలుగు రోజుల క్రితం మా ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యాడు. అతను పలుమార్లు గుండెపోటుకు గురయ్యాడు. దీంతో మేము ఆపరేషన్ చేయమని చెప్పాం. అయినా కుటుంబీకులు పట్టుబడడంతో ఆరోగ్య శ్రీ పథకంలో శనివారం మధ్యాహ్నం ఆపరేషన్ చేశాం. ఆదివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందాడు. విషయం కుటుంబ సభ్యులకు తెలపగా మృతదేహాన్ని ప్రత్యేక అంబులెన్స్‌లో తీసుకెళ్లారు. మళ్లీ కావాలనే ఉదయం మా ఆస్పత్రి వద్దకు తీసుకొచ్చి నిరసన వ్యక్తం చేశారు.

-విశ్వనాథ్, ఆస్పత్రి వైద్యుడు

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

- మరొకరికి తీవ్ర గాయాలు

భూపాలపల్లి అర్బన్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని పట్టణ సమీపం పరకాల-భూపాలపల్లి జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందగా, ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. సీఐ రాంనరిసింహారెడ్డి కథనం ప్రకారం పట్టణ సమీపంలోని సన్‌వ్యాలీ పాఠశాల సమీపంలో ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో బొల్లి సాయికుమార్(26) అక్కడికక్కడే మృతి చెందాడు. బెస్త ప్రవీణ్‌కు తీవ్ర గాయాలు కావడంతో వరంగల్‌కు తరలించినట్లు తెలిపారు. మృతుడు సాయికుమార్ భూపాలపల్లి ఏరియాలోని ఓపెన్ కాస్ట్-3 కాంట్రాక్ట్ కంపెనీలో పని చేస్తున్నాడు. ప్రమాదానికి సంబంధించి అర్ధరాత్రి వరకు ఎవరూ ఫిర్యాదు చేయలేదని సీఐ తెలిపారు.